సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 9 । మే । 2023

బాచుపల్లి ప్లాట్లకు అనూహ్య స్పందన

సాక్షి, సిటీబ్యూరో: ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో బాచుపల్లి వద్ద హెచ్ఎండీఏ రూపొందించిన లే అవుట్ ప్లాట్లకు అనూహ్యమైన స్పందన లభించింది. రెండో దశలో 133 ప్లాట్లను ఆన్‌లైన్ వేలం ద్వారా విక్రయించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సోమవారం నిర్వహించిన ప్రీ బిడ్ సమావేశంలో కొనుగోలుదారులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని తమ ఆసక్తిని ప్రదర్శించారు.

రంగస్థల కళలపై ఉచిత శిక్షణ

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12 నుండి 21వ తేదీ వరకు థియేటర్ టెక్నికల్ వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. రంగస్థల రంగంలో జాతీయ స్థాయి నిష్ణాతులైన సాంకేతిక నిపుణులతో ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.



నగరంలో త్వరలో రోడ్డెక్కనున్న డబుల్ డెక్కర్ బస్సులపై సిటీ వాసుల్లో ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో వీటిని ట్రయల్‌రన్ కోసం సోమవారం నగర వీధుల్లో నడిపించారు.

న్యూస్‌రీల్

మైసిగండి ఆలయానికి భారీగా ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కడ్తాల్ : మైసిగండిలో కొలువైన మైసమ్మ తల్లి ఆలయ పరిసరాల్లో శాక్తేయ మొక్కుబడుల రసీదు రుసుం వసూలు చేసుకునే హక్కుకు సంబంధించి బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ నెల 2న నిర్వహించిన వేలం పాటలో నిర్ణీత ధర రాకపోవడంతో తిరిగి సోమవారం ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈవో స్నేహలత, పర్యవేక్షణ అధికారి, ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ కుమార్ ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. మొత్తం 11 మంది బహిరంగ వేలంలో పాల్గొనగా రూ.25 లక్షలకు మైసిగండికి చెందిన కేతావత్ సుమన్ దక్కించుకున్నారు. గత ఏడాది రూ.23.08 లక్షలు పలకగా ఈ ఏడాది రూ.1.92 లక్షలు అదనంగా ఆలయానికి సమకూరింది. కార్యక్రమంలో ఆలయ అర్చక సిబ్బంది పాల్గొన్నారు.

ఫార్మాసిటీ ఠాణాకు భవనం పరిశీలన



ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్ తదితరులు

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడానికి సోమవారం మహేశ్వరం జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ నక్కర్తమేడిపల్లిలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. ఫార్మాసిటీ కేంద్రంగా యాచారం, కందుకూరు పోలీస్ స్టేషన్ల పరిధిలోని 19 గ్రామాలను కలిపి కొత్తగా హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. నక్కర్తమేడిపల్లి–నానక్‌నగర్ గ్రామాల మధ్యన ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి 5 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. శాశ్వత భవనాన్ని నిర్మించే వరకు నక్కర్తమేడిపల్లిలో తాత్కాలిక ఠాణా ప్రారంభించనున్నారు. ఈ క్రమంలో గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించారు. నీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్, సిబ్బంది వసతి తదితరాలపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ యాచారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. బాధితుల నుంచి ఫిర్యాదుల స్వీకరణ, ఏఏ సమస్యలపై ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయి, సాగర్‌రోడ్డుపై ప్రమాదాల నివారణ కోసం ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు తదితర వివరాలను సీఐ లింగయ్యను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏసీపీ ఉమామహేశ్వర్ రావు, ఎస్ఐలు వెంకటనారాయణ, ప్రసాద్, గోపాల్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్ : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ తిరుపతి రావు పేర్కొన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ఆయా అంశాలపై 25 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ సమ్మిట్‌కు ఎంపిక

ఇబ్రహీంపట్నం: వరల్డ్ టెక్నాలజీ డే సందర్భంగా న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో ఈనెల 11 నుంచి 14 వరకు జరిగే రోబోటిక్ టెక్నాలజీ సమ్మిట్‌కు ఇబ్రహీంపట్నం ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. వెల్‌కమ్ రోబోట్ అనే ప్రాజెక్ట్‌ను రూపొందించిన 9వ తరగతి విద్యార్థినులు వైష్ణవి, శ్రీహరిణి, మనీష ఈ సమ్మిట్‌కు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, గైడ్ టీచర్ సుమిత్రాదేవి, ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణిని సోమవారం పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేష్ అభినందించారు.



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు, జనం

కాంగ్రెస్‌లో జోష్



ప్రియాంకగాంధీకి కండువా కప్పుతున్న డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

'యువ సంఘర్షణ సభ'కు భారీగా యువత

- ఉత్తేజపరిచిన ప్రియాంక ప్రసంగం
- నినాదాలతో హోరెత్తించిన కార్యకర్తలు
- సందడిగా మారిన సరూర్‌నగర్ స్టేడియం పరిసరాలు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: నిరుద్యోగ యువతకు భరోసా కల్పించేందుకు తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సరూర్‌నగర్ స్టేడియం వేదికగా నిర్వహించిన 'యువ సంఘర్షణ సభ' గ్రేటర్ కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్తేజాన్ని నింపింది. కర్ణాటకలో ఎన్నికల ప్రచారాన్ని ముగించుకుని సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. అప్పటికే ఎల్బీనగర్ చౌరస్తాలోని తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాల వేసి విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి ర్యాలీగా వేదిక పైకి చేరుకున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహా.. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క తదితరులు ప్రియాంకకు ఘన స్వాగతం పలికారు.

అభివాదం చేస్తూ...అమరులను స్మరిస్తూ

సాయంత్రం 5.25 గంటలకు కార్యకర్తలకు అభివాదం చేస్తూ ప్రియాంక ప్రధాన వేదికపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా సభకు వచ్చిన కార్యకర్తలు జై కాంగ్రెస్..జై ప్రియాంక నినాదాలతో హోరెత్తించారు. ఆమె తన ప్రసంగంతో కేడర్‌ను ఉత్తేజపరిచారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఐదు అంశాలు ప్రధానంగా రూపొందించిన హైదరాబాద్ డిక్లరేషన్‌ను ప్రకటించారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్కుడు పోచంపల్లి చేనేత కార్మికులు నేసిన చీరను ప్రియాంకకు బహూకరించారు.

ఆకట్టుకున్న గద్దర్ ఆటాపాట

ప్రజా యుద్ధనౌక గద్దర్ మళ్లీ కాలికి గజ్జెకట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆయన ఆటాపాటకు కొంత దూరంగా ఉన్నారు. తాజాగా ప్రియాంక సభలో కాలికి గజ్జెకట్టి 'అమ్మా తెలంగాణమా..ఆకలి కేకల గానమా' అంటూ మరోసారి తన గళాన్ని వినిపించడం సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'బంగారు తెలంగాణ రాలే తమ్మీ.. మనం కన్న కలలు నెరవేరలే తమ్మీ' అంటూ రమేష్ నేతృత్వంలోని కళా బృందం ఆలపించిన గానం నిరుద్యోగ యువతను విశేషంగా ఆకట్టుకుంది. ఇదిలా ఉంటే నిరుద్యోగ సంఘర్షణ సభకు వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు భారీగా తరలిరావడంతో సరూర్‌నగర్ స్టేడియం పరిసరాలు ట్రాఫిక్‌తో కిక్కిరిసిపోయాయి. ప్రధాన రహదారి సహా కాలనీ రోడ్లు వాహనాలతో నిండిపోయాయి. సాధారణ ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

ఎందుకీ వివక్ష?

కేసీఆర్ ఉద్యోగం ఊడగొడితే.. తెలంగాణలో లక్ష మంది నిరుద్యోగులకు ఉద్యో గాలు దక్కుతాయి. యూనివర్సిటీ విద్యార్థులు, నిరుద్యోగుల విషయంలో సీఎం వివక్ష చూపుతున్నారు. నిరుద్యోగుల నోట్లో మట్టికొట్టి.. ఇతర రాష్ట్రాలకు చెందిన వారికి ఉద్యోగాలు కట్టబెడుతున్నారు.

– మానవతారాయ్, ఓయూ జేఏసీ

నిరుద్యోగులకు మొండిచేయి

నిరుద్యోగులను సీఎం కేసీఆర్ రెండుసార్లు మోసం చేశారు. ఎన్నికల్లో ఓటమి పాలైన కుమార్తె కవితకు ఎమ్మెల్సీ పదవిని కట్టబెట్టారు కానీ.. ఏళ్ల తరబడి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు మాత్రం మొండిచేయి చూపిస్తున్నారు.

– బల్మూరి వెంకట్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు

స్థానికులకు రిజర్వేషన్లు కల్పిస్తాం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు సంస్థల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా బిల్లు తెస్తాం. పరిశ్రమల పేరుతో భూములు కోల్పోయిన వారి పిల్లలకు ఉపాధి అవకాశాలు దక్కేలా చర్యలు తీసుకుంటాం.వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకివచ్చి తీరుతుంది.

– చల్లా నర్సింహారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

'పల్లె ప్రగతి' భేష్

షాబాద్: మండలంలోని సర్దార్‌నగర్ గ్రామాన్ని సోమవారం ఎన్ఐఆర్‌డీ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రభాకర్, రాజేశ్వర్, నర్సింహులు సందర్శించారు. పల్లెప్రగతిలో చేపట్టిన పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, హరితహారం నర్సరీ, కంపోస్టుయార్డు తదితర వాటిని పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి కంపోస్టుయార్డుకు తరలించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నట్లు పంచాయతీ సిబ్బంది వారికి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రల్లెప్రగతి కార్యక్రమంతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం ఎంతో బాగుందని ఎన్ఐఆర్‌డీ బృందం కితాబిచ్చింది. పల్లెప్రకృతివనంలో నీడనిచ్చే మొక్కలతో పాటు పండ్లజాతి మొక్కలు పెంచడం బాగుందన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ నీరజాదేవి, ఎంపీడీఓ అనురాధ, ఎంపీఓ హన్మంత్‌రెడ్డి, టీఏ ప్రవీణ్, సర్పంచ్ మునగపాటి స్వరూప, ఎంపీటీసీ వనిత, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఏపీఓ వీరాసింగ్, ఉపసర్పంచ్ ఇందిర పాల్గొన్నారు.



పల్లె ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న ఎన్ఐఆర్‌డీ అసిస్టెంట్ ప్రొఫెసర్ల బృందం

విద్యార్థుల జీవితాలతో చెలగాటం సహించం



ఆందోళనకారులను అరెస్టు చేస్తున్న పోలీసులు

- గురునానక్ విద్యాసంస్థల వద్ద బీజేవైఎం ఆందోళన
- ఉద్రిక్త పరిస్థితి.. ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఇబ్రహీంపట్నం: విద్యార్థుల జీవితాలతో గురునానక్ విద్యాసంస్థ చెలగాటమాడుతోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదిష్ మండిపడ్డారు. యూనివర్సిటీ అనుమతులు పొందకుండానే అడ్మిషన్లు తీసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడిన విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ అనుమతి వచ్చిందంటూ ప్రచారం చేసి సుమారు నాలుగు వేల మంది విద్యార్థులను, వారి తల్లిదండ్రులను తప్పుదోవ పట్టించి రూ.కోట్ల రూపాయలను దండుకున్నారని ఆరోపించారు. విద్యార్థులకు ఎలా భరోసా కల్పిస్తారో..ఏం న్యాయం చేస్తారో తేల్చాలని డిమాండ్ చేశారు. కాగా, ఆందోళనకు దిగిన బీజేవైఎం నేతలు యాజమాన్యానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గేట్ వద్ద ఉన్న కళాశాల బోర్డును పగులగొట్టారు. గేట్ దూకి కళాశాలలోకి ప్రవేశించారు. దీంతో ఒక్కసారిగా ఉద్రిక్తపరిస్థితి నెలకొంది. రంగంలోకి దిగిన పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బూర దిలీప్, శ్రీశైలం, మహేందర్, పుష్పాల శాంతికుమార్, కార్తీక్‌గౌడ్, భగీరథ, అశోక్, యాదగిరిరెడ్డి, ప్రేమ్‌సాయి, రఘుగౌడ్, ముత్యాల మహేందర్, శేఖర్‌రెడ్డి, రూపక్ తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు కొనసాగిన భట్టి యాత్ర



జిల్లెలగూడలో భట్టి యాత్రకు స్వాగతం పలుకుతున్న మహిళా కార్పొరేటర్లు కవిత, మౌనిక

హుడాకాంప్లెక్స్: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ యాత్ర మూడోరోజు సోమవారం కొనసాగింది. సరూర్‌నర్ స్టేడియంలో జరిగిన యువ సంఘర్షణ సభకు ఎల్బీనగర్ చౌరస్తా హిమగిరి ఫంక్షన్‌హాల్ నుంచి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ప్రియాంక గాంధీతో కలిసి బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం సరూర్‌నగర్ స్టేడియం నుంచి తిరిగి పాదయాత్రను ప్రారంభించారు. దిల్‌సుఖ్‌నగర్ డాక్టర్స్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్, కర్మన్‌ఘాట్, గాయత్రీనగర్, జిల్లెలగూడ వరకు కొనసాగించారు. వెంకటేశ్వరకాలనీ వద్ద ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలకు కేటాయించిన నాలుగు శాతం రిజర్వేషన్‌ను తొలగిస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గుర్తుచేశారు. తమ రిజర్వేషన్లు రద్దు కాకుండా చూడడంతో పాటు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. గాయత్రీనగర్ వద్ద మహిళా కార్పొరేటర్లు చల్లా కవిత, సిద్దాల మౌనిక హారతితో స్వాగతం పలికారు. యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి గజమాలతో భట్టి విక్రమార్కను సత్కరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తూ నినాదాలతో హోరెత్తించారు. రాత్రికి గాయత్రీనగర్‌లోని చల్లా బాల్‌రెడ్డి ఇంటి వద్ద పాదయాత్ర బృందం బస చేసింది.

మితిమీరిన వేగానికి ముగ్గురు బలి

- కారును ఢీకొట్టిన టిప్పర్
- అక్కడికక్కడే ముగ్గురి దుర్మరణం
- మృతుల్లో ఇద్దరు చిన్నారులు



షెహజాదిబేగం (ఫైల్)



సమీర్, ఫాతిమా (ఫైల్)

అబ్దుల్లాపూర్‌మెట్: మితిమీరిన వేగం ముగ్గురిని బలితీసుకుంది. ఈ విషాదకర ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా బిచ్కుంద గ్రామానికి చెందిన హనీఫా పెద్ద కూతురు షెహజాది బేగం (35) అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ శివారులోని ప్రమీల ఫాం హౌస్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ బలిజగూడలో నివాసముంటోంది. వేసవి సెలవులు కావడంతో హనీఫా తన రెండో కూతురి కొడుకు ఎండీ సమీర్ (9), మూడో కూతురి కుమార్తె ఫాతిమా(5)ను తీసుకుని పదిరోజుల క్రితం షెహజాది బేగం ఇంటికి వచ్చింది. ఆదివారం రాత్రి షెహజాది బేగం ఇద్దరు చిన్నారులతో కలిసి తన కారులో పెద్దఅంబర్‌పేటలోని ఓ బేకరి వద్దకు వెళ్లింది. 11 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో ఏఎల్‌నగర్ కమాన్ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న షెహజాది బేగం, సమీర్, ఫాతిమా కారులోంచి ఎగిరి చెల్లాచెదురుగా పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. ప్రమాదం జరిగిన సమయంలో రెండు వాహనాలు కూడా అతి వేగంగా ప్రయాణిస్తుండడంతోనే ఇంత ఘోరం జరిగిందని స్థానికులు చర్చించుకున్నారు. కారు ఇంజిన్ ఊడిపోయి కొద్ది దూరంలో పడిపోగా, టిప్పర్ సంఘటనా స్థలంలో బోల్తాపడడం గమనార్హం.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

- డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

షాద్‌నగర్‌రూరల్: రోగులకు మెరుగైన వైద్య సేవలను అందిస్తూ ఆరోగ్య సూచీలో జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జయలక్ష్మి ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా కృషి చేయాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేలా కృషి చేయాలన్నారు. వైద్యాధికారులు సమయ పాలన పాటించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పీఓడీటీ అనిత, జిల్లా మాస్ మీడియా అధికారి నరహరి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి స్వర్ణకుమారి, టీబీ అధికారి అరుణకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు,ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సూపర్ ఫాస్ట్‌గా..

- ఊపందుకున్న సికింద్రాబాద్ స్టేషన్ ఆధునీకరణ పనులు
- 2025 నాటికి సరికొత్త రైల్వేస్టేషన్ ఆవిష్కారం
- తాత్కాలికంగా టికెట్ బుకింగ్, ఆర్‌పీఎఫ్ కార్యాలయాలు
- రూ.700 కోట్లతో చేపట్టిన రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టు



సాక్షి, సిటీబ్యూరో: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. సకాలంలో ప్రాజెక్టును పూర్తి చేయడమే ధ్యేయంగా పనులను కొనసాగిస్తున్నారు. దక్షిణ మధ్య రైల్వేలోనే అతి ప్రధానమైన స్టేషన్ అయిన సికింద్రాబాద్‌లో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను చేపట్టారు. గత నెల 8న ప్రధాని మోదీ చేతుల మీదుగా స్టేషన్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టును ప్రారంభించిన సంగతి తెలిసిందే. గత నెల నుంచే పనుల్లో వేగం పెరిగింది. ప్రస్తుతం తాత్కాలిక బుకింగ్ కార్యాలయం, రైల్వే రక్షకదళం కార్యాలయం నిర్మాణ పనులు తుది దశకు చేరాయి. ప్రతిపాదించిన ప్రణాళిక ప్రకారమే పనులు పూర్తి చేసేవిధంగా కార్యాచరణ చేపట్టినట్లు దక్షిణమధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

వడివడిగా పునరభివృద్ధికి అడుగులు..

- ఇప్పటి వరకు భూసార పరీక్ష, టోపోగ్రాఫిక్ సర్వే పూర్తి చేసి తాత్కాలిక కార్యాలయాల నిర్మాణ పనులు చేపట్టారు. తాత్కాలిక బుకింగ్ కార్యాలయంలో ఫ్లోరింగ్, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ఫాల్స్ సీలింగ్ పనులు కొనసాగుతున్నాయి. ఈ నెలలోనే దీన్ని ప్రారంభించనున్నారు.
- ఆర్పీఎఫ్ భవనం పునాది, స్తంభాల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. స్లాబ్, పార్టిషన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. మరో రెండు నెలల్లో కొత్త భవనాన్ని ప్రారంభించనున్నారు.
- ప్రస్తుతం ఉన్న స్టేషన్ భవనానికి దక్షిణం వైపున కొత్త స్టేషన్ భవనం కూడా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇటు వైపు నుంచి వచ్చే ప్రయాణికులకు అండర్‌గ్రౌండ్ పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. స్టేషన్ దక్షిణ భాగంలో ఫౌండేషన్ కోసం తవ్వకాలు, పునాది పనులు పురోగతిలో ఉన్నాయి.

భారీ నీటి ట్యాంకులు..

- సుమారు 11 లక్షల లీటర్ల నీటి సామర్థ్యం గల భారీ భూగర్భ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే 9.5 లక్షల లీటర్ల భూగర్భ ట్యాంకులకు పనులు వేగంగా కొనసాగుతున్నాయి. దీనికి అనుగుణంగా ప్లాట్‌ఫాం 10 వైపు పీఆర్ఎస్ భవనంలో భూగర్భ ట్యాంకుల కోసం పీసీసీ బెడ్‌లు వేయడంతోపాటు తవ్వకం పనులు పూర్తి చేశారు.
- ఉత్తర దిశ బిల్డింగ్‌లోని కార్యాలయాల తరలింపు పురోగతిలో ఉంది. ప్రస్తుతానికి 60 శాతం యుటిలిటీల షిఫ్టింగ్ పూర్తయిందని, మిగిలిన యుటిలిటీల బదిలీ పురోగతిలో ఉందని అధికారులు తెలిపారు. అనంతరం ఉత్తరం వైపు పనులు కూడా చేపట్టనున్నారు.

యాజమాన్యమే బాధ్యత వహించాలి



పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

- కార్మికుడి కుటుంబానికి న్యాయం చేయాలి
- పరిశ్రమ ఎదుట అఖిలపక్ష నాయకుల ధర్నా

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో కార్మికుడు పాశం సురేశ్ మృతికి వావిన్ పరిశ్రమ యాజమాన్యమే బాధ్యత వహించాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పరిశ్రమ గేటు ఎదుట ధర్నా చేపట్టారు. సురేశ్‌ను హెచ్‌ఆర్ మేనేజర్ రవికుమార్ సెలవులు ఇవ్వకుండా.. కక్షతో వేధింపులకు గురిచేయడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. కార్మికుడి మృతితో కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుందన్నారు. వారికి న్యాయం చేయడానికి వీలుగా పరిశ్రమ నిర్వాహకులు మృతుడి కుటుంబంలో ఒకరికి శాశ్వత ఉద్యోగం, రూ.కోటి పరిహారం చెల్లించాలని నినాదాలు చేశారు. న్యాయం చేసేంత వరకు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేది లేదని ఆందోళనకారులు భీష్మించారు. పోలీసులు జోక్యం చేసుకొని యాజమాన్యంతో చర్చలు జరిపే విధంగా చొరవ చూపుతామని సముదాయించడంతో వారు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, కోస్గి శ్రీనివాస్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీవర్ధన్‌రెడ్డి, జోలీ రవీందర్, వస్పుల మహేందర్, నర్సింహ్మగౌడ్, సాయిబాబా, నాగరాజుచారి, భేరి శ్రీనివాస్, వెంకటేష్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా విక్రేతల బైండోవర్

ఒకరికి రూ.లక్ష జరిమానా

మహేశ్వరం: నాటు సారా తయారీ చేసి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను సోమవారం ఎక్సైజ్ పోలీసులు పట్టుకుని తహసీల్దార్ మహ్మద్‌అలీ ఎదుట బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి, ఎస్‌ఐ హన్మంత్, ప్రవీణ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పెద్దమ్మ తండాలో నాటు సారా తయారీ చేసి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు దాడి చేసి వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. గతంలో పట్టుబడిన నెహ్రూ నాయక్ బైండోవర్‌ను ఉల్లఘించినందుకుగాను కేసు నమోదు చేశామన్నారు. ఇందుకు ఆయనకు జైలు శిక్ష లేదా రూ.లక్ష జరిమానా చెల్లించాలని ఎక్సైజ్ పోలీసులు నోటీసులిచ్చారు. జరిమానా చెల్లించకుంటే జైలుకు పంపుతామని ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి తెలిపారు.



పోలీసుల అదుపులో సారా విక్రేతలు

PUBLIC NOTICE

The general public here by informed that my client Sri. JONNADA VENKAT REDDY, S/O.Sri. J. ANJI REDDY, aged about 40 years, Occupation Business, Presently Residing at Plot No. 64/P, Jana Chaitanya Colony, Turkayamjal Village, Abdullapurmet Mandal, Ranga Reddy District, Telangana State, Aadhaar No 4252 0623 2175, that my client already purchased the Open Land bearing Plot No.380 South Part, admeasuring 200 Sq. Yards or 167.23 Sq. Mtrs., In Survey No.'s. 34, 35, 44, 46, 47 to 50, Situated at A.V.NAGAR-1, TURKAYAMJAL VILLAGE, Abdullapurmet Revenue Mandal, Formerly Under Hayathnagar Revenue Mandal, Turkayamjal Grampanchayath, Presently Under Turkayamjal Municipality, Ranga Reddy District, Bounded by North - Part of Plot No.380, South - Plot No.381, East -40' Wide Road, West - Plot No.362, having purchased the same property from: SRI. DANDUGULA VENKATESH S/o. SRI. D. YADAIAH, through Registered Vide Sale Deed Document No. 2711/2023, dated: 13March2023, Regd. In S.R.O. Vanasthalipuram, Ranga Reddy District of valuable sale consideration amount, and one of the SALE DEED Original Link Document No.2921/1998, Book-I, Volume No. 5050, at pages: 317 to 328, dated: 01-July-1998, Regd. at S.R.O. Hyderabad East, was misplaced by my Client 14th March 2023 at approx 11:00 am to 12:00 am, I was travelling in Yellow Taxi from Turkayamjal to Vanasthalipuram, Ranga Reddy District, Telangana State. My client recognized he left his bag in the taxi, there was above referred property one of the SALE DEED Original Link Document No. 2129/1998, was misplaced by my client, if anybody is having objection with regard to the sale of the property then they shall contact the undersigned with relevant documents within in (7) seven days of this Publication, otherwise the parties will proceed for the registration of the property. Thereafter no objection will be entertained.

Sd/- **P. JANARDHAN**, Advocate,
Off: H.No.5-4-1689/1/N, Shop No's. 9 & 10, S.R.O. Building, Vanasthalipuram, Ranga Reddy District (TS).
Mobile No: 9391023823
Date: 17-04-2023

PUBLIC NOTICE

The General Public are hereby notified that my client are intending to purchase the Land admeasuring 267.00 Square Yards situated in Survey No.126 Plot No.89 at Hyderaguda Village, Rajendra Nagar Mandal and Municipality Ranga Reddy District, Telangana State. From its owner Smt. P. Anuradha W/o Sri P. Ramesh Charry & Mr. Mohammed Imran Khan S/o Mr. Mohammed Saleem Khan.

Boundaries: North : Plot No.88, South : Plot No.90, East : 40 Feet Wide Road, West : Plot No.81.

Any Person or persons, companies banks, any financial instutitons, organizations whosoever have/has/had any claim, charge, right or interest and objection whatsoever in respect of sale of above land may contact my office at the below address with relevant documents if any within ONE WEEk from the date of this publication or else my client shall proceed with the sale transcation and any claims whatsoever raised thereafter will not be entertained.

Sd/- MOHAMMED SALMAN
Advocate
Office at H.No.8-4-544, Mothi Nagar, Erragadda, Hyderabad - 500018, TS.
M: +91 9347221912
Date: 08-05-2023

మహిళా ప్రయాణికులకు రూ.80 కే టీ-24 టికెట్

సిటీ బస్సుల్లో 24 గంటలు ప్రయాణ సదుపాయం

సాక్షి, సిటీబ్యూరో: మహిళా ప్రయాణికులకు టీ–24 టికెట్లపైన ఆర్టీసీ రాయితీ కల్పించింది. రూ.80 లకే ఈ టికెట్లు లభించనున్నాయి. మంగళవారం నుంచి ఈ సదుపాయాన్ని నగరంలోని సిటీ బస్సుల్లో అందుబాటులోకి తేనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. వేసవి నేపథ్యంలో గ్రేటర్ పరిధిలో ప్రయాణించే మహిళల కోసం ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో 24 గంటల పాటు ప్రయాణించేందుకు ఆర్టీసీ టి–24 టికెట్లను అందజేస్తున్న సంగతి విదితమే. సాధారణ ప్రయాణికులకు రూ.90లకు విక్రయిస్తుండగా, సీనియర్ సిటిజన్‌లకు రూ.10 తగ్గింపుతో రూ.80కే అందజేస్తోంది. తాజాగా మహిళా ప్రయాణికులకు ఈ రాయితీ సదుపాయాన్ని అందజేశారు. కండక్టర్ల వద్ద టికెట్లు అందుబాటులో ఉంటాయి.

రోజుకు 40 వేల టిక్కెట్లు...

గ్రేటర్‌లో ప్రయాణికులకు సదుపాయంగా ఉన్న టి–24 టిక్కెట్‌ల అమ్మకాలు గణనీయంగా పెరిగినట్లు అధికారులు తెలిపారు. గతంలో రోజుకు 25 వేల టికెట్లు అమ్ముడు కాగా, ఇప్పుడు వాటి సంఖ్య రెట్టింపైనట్లు పేర్కొన్నారు. గతంలో ఈ టిక్కెట్ల ధర రూ.100 ఉండగా రూ.90 తగ్గించారు. ఆ తరువాత సీనియర్ సిటిజన్లకు, ప్రస్తుతం మహిళలకు మరింత రాయితీనిచ్చి రూ.80కే విక్రయిస్తున్నారు. ధర తగ్గింపు తర్వాత ప్రతి రోజు సగటున 40 వేలకు పైగా టికెట్లు అమ్ముడవుతున్నాయి. మరోవైపు మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం టి–6 టికెట్ పేరుతో రూ.50 టికెట్లను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఈ టికెట్లపైన ప్రయాణం చేయవచ్చు. అలాగే వీకెండ్స్, సెలవు రోజుల్లో నలుగురు కలిసి ప్రయాణం చేసేందుకు ఎఫ్–24 టికెట్లను రూ.300కు అందజేస్తున్నారు.

మలుపు తిరిగిన భూ వివాదం

వీర్లపల్లి శంకర్ తప్పులేదు..
- సీఐ మాట్లాడతానంటేనే ఫిర్యాదు
- ఫిర్యాదుదారుడు శ్రీనివాస్

నందిగామ: కాంగ్రెస్ నేత వీర్లపల్లి శంకర్‌తో పాటు మరో ఇద్దరిపై నమోదైన కేసు సోమవారం సరికొత్త మలుపు తిరిగింది. ఫిర్యాదు దారుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. భూవివాదంలో వీర్లపల్లి శంకర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తుల తప్పిదమేమీ లేదని సీఐ ఫిర్యాదు చేయమంటేనే కేసు పెట్టానని స్పష్టం చేశారు. సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'భూ వివాదంలో ముగ్గురిపై కేసు' శీర్షికన ప్రచురితమైన వార్త స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు సోమవారం శ్రీనివాస్ మాట్లాడుతూ.. గతంలో శంకర్‌తో పాటు మరో ఇద్దరి వ్యక్తుల వద్ద భూమి కొనుగోలు చేసిన మాట వాస్తవమని, గడువులోగా తన వద్ద డబ్బులు సర్దుబాటు కాక రిజిస్ట్రేషన్ చేసుకోలేదన్నారు. గడువుకు ముందే ఆ భూమిని వెంకమ్మగూడకు చెందిన అశోక్‌కు విక్రయించి రీ అగ్రిమెంటు చేశానని, అశోక్ సకాలంలో నాకు డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. దీంతో పలుసార్లు గడువును పొడిగించినా డబ్బులు సర్దుబాటు కాలేదన్నారు. ఈ నేపథ్యంలో గతేడాది జూలై 20న అగ్రిమెంటును ఇరువురి అంగీకారంతో రద్దుచేసుకున్నట్లు తెలిపారు. తాను శంకర్‌తో పాటు మరో ఇద్దరికి ఇచ్చిన డబ్బులను భూమి విక్రయించిన తర్వాత ఇస్తానని శంకర్ చెప్పాడని, శంకర్ భూమి ఇప్పటికి విక్రయించక పోవడంతో డబ్బులు ఇవ్వలేదని. ఇంతలో అశోక్ డబ్బుల కోసం ఒత్తిడి తీసుకొచ్చాడని. అంతటితో ఆగని అశోక్ ఇటీవల తనపై నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. అశోక్ ఫిర్యాదు మేరకు సీఐ రామయ్య తనను పీఎస్‌కు పిలిపించడంతో విషయం చెప్పానని అన్నారు. దీంతో సీఐ వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు చేస్తే పిలిపించి మాట్లాడుతా అని చెప్పడంతో కేసు పెట్టానన్నారు. పిలిపించి మాట్లాడుతా అని చెప్పిన సీఐ వెంటనే శంకర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశాడని అన్నారు. ఈ విషయంలో వీర్లపల్లి శంకర్ తప్పులేదన్నారు.

చట్ట ప్రకారమే చర్యలు

శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేశా. బలవంతగా ఫిర్యాదు తీసుకోవాల్సిన అవసరం నాకు లేదు. వ్యక్తులెవరైనా చట్టప్రకారమే చర్యలు తీసుకుంటాం. శ్రీనివాస్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసి మాట మార్చడం సరికాదు.

– సీఐ రామయ్య

రైతు సమస్యలను పరిష్కరించండి

బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌బాబు

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌కు మామిడిని తీసుకువచ్చే రైతుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌బాబు, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మామిడి రైతుల సమస్యలను తెలుసుకునేందుకు బాటసింగారం మార్కెట్‌ను సందర్శించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతుల వద్ద నుంచి 11శాతం కమీషన్ వసూళ్ల చేయడాన్ని తగ్గించడంతో పాటు రవాణా సౌకర్యాలు, గిట్టుబాటు ధర చెల్లింపు తదితర సమస్యలపై మార్కెట్ అధికారులతో చర్చించామన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాపయ్యగౌడ్, ఎంసీ యాదగిరి, రమాదేవి, శ్రీనివాస్, దినేశ్, రైతులు మల్లేశ్, శివ, ఈశ్వరయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్ అధికారులతో చర్చిస్తున్న బీజేపీ నేతలు

తైక్వాండోలో హైదరాబాదీల సత్తా

మణికొండ: జపాన్ దేశంలో జరిగిన అంతర్జాతీయ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో హైదరాబాద్‌కు చెందిన క్రీడాకారులు రాణించారు. మన దేశం తరపున ఐదుగురు క్రీడాకారులు ఇందులో పాల్గొనగా అందులో ఇద్దరు మెడల్‌లను సాధించారు. గ్లెండల్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో 6 గ్రేడ్ చదువుతున్న రాబ్య వర్మ, ఆగా ఖాన్ అకాడమీకి చెందిన రిషాన్ చంద్ర మహంతి సిల్వర్ మెడల్‌లు సాధించనట్టు గ్రాండ్ మాస్టర్, సోమఫిట్ తైక్వాండో అకాడమీ కోచ్ విజయ్‌కుమార్ తెలిపారు. వీరితో పాటు శ్రీనిధి గ్లోబల్ స్కూల్‌లో 5వ గ్రేడ్ చదువుతున్న ధృవబొజ్జ, ధృతిబొజ్జా, శ్రీనిధి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 7వ గ్రేడ్ చదువుతున్న హవిష్‌బొజ్జ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొన్నారని ఆయన వివరించారు. వీరిని సోమవారం జాతీయ ఒలింపిక్ అసోసియేషన్ కోశాధికారి మహేశ్వర్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి వహాజ్ అలీఖాన్, రిఫెరెన్స్ కమిటీ చైర్మన్ నర్సింహాలు వారిని హైదరాబాద్‌లో అభినందించారని కోచ్ తెలిపారు.



క్రీడాకారులను అభినందించిన అసోసియేషన్ నాయకులు

మానవ అక్రమ రవాణా నేరం



ప్రతిజ్ఞ చేయిస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

శంషాబాద్: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ప్రతిఒక్కరూ సరైన అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాధిక సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం శంషాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే అతి పెద్ద నేరమని ఆమె అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సామాజిక, ఆర్థిక స్థితిగతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. మానవ అక్రమ రవాణాకు గల కారణాలపై ప్రజల్లో చైతన్యం మరింత పెరగాల్సిన అవసరముందన్నారు. ప్రజ్వల సంస్థ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ, సీనియర్ కో ఆర్గినేటర్ ఎం. సురేష్, శ్రావ్య, వినోద్ పాల్గొన్నారు.

పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీ మృతి



అంజయ్య మృతదేహం

ఇబ్రహీంపట్నం: పని ప్రదేశంలో ఉపాధి హామీ కూలీ మృతి చెందిన ఘటన రాయపోల్ గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. కూలీలు తెలిపిన ప్రకారం.. ఉపాధి హామీ పనుల్లో భాగంగా అంజయ్య(65) ఫారెస్ట్ ఏరియాలో ఫాంపాండ్ నిర్మాణ పనులకు వెళ్లారు. పని చేస్తుండగా అస్వస్థతకు గురికావడంతో వెంటనే ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కూలీని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కాగా పని ప్రదేశంలో మృతి చెందిన అంజయ్యకు ప్రభుత్వం నుంచి లభించే రూ.2లక్షల ఎక్స్‌గ్రేషియా వచ్చేందుకు ప్రయత్నిస్తానని ఉపాధి హామీ పథకం అదనపు అధికారి తిరుపతాచారి తెలిపారు. సర్పంచ్ బల్వంత్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

శంకర్‌పల్లి: బైక్‌పై నుంచి కింద ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్వర్తి గ్రామ శివారుల్లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. సంగారెడ్డి జిల్లా, హత్నూర్ మండలం ఎల్లమ్మగూడకు చెందిన నాగరాజు(34) చేవెళ్లలో దావత్ ఉందని ఆదివారం సాయంత్రం ఇంట్లో చెప్పి బైక్‌పై బయలుదేరాడు. రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా అర్ధరాత్రి ఎల్వర్తి గ్రామ శివారుల్లో బైక్ అదుపు తప్పి కింద పడింది. దీంతో నాగరాజు తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉందని సీఐ ప్రసన్నకుమార్ తెలిపారు.

మహిళ అదృశ్యం



సునీత (ఫైల్)

రాజేంద్రనగర్: మహిళ అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. లక్ష్మిగూడకు చెందిన మహేష్, సునీత(35) భార్యాభర్తలు. ఏప్రిల్ 13న ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. సునీతకు కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వట్టినాగులపల్లిని నార్సింగిలోకి మార్చండి



సీఎం కేసీఆర్‌కు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే

మణికొండ: పోలీస్ స్టేషన్ల విభజనలో నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వట్టినాగులపల్లి గ్రామం గతంలో గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉంచారని, దాన్ని నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చాలని సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కోరారు. సోమవారం నార్సింగిలోని శ్రీకృష్ణ మూవ్‌మెంట్ హెరిటేజ్ టవర్ శంకుస్థాపనకు వచ్చిన ముఖ్యమంత్రికి ఆయన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మిర్జాగూడ, మియాఖాన్‌గూడ, జన్వాడ తదితర గ్రామాలను ఇటీవల కొత్తగా ఏర్పడిన మోకిల పోలీస్‌స్టేషన్ పరిధిలోకి మార్చారన్నారు. నార్సింగి పోలీసులపై పనిభారం తగ్గటంతో ప్రస్తుతం వట్టినాగులపల్లిని ఇటువైపు మార్చాలని కోరానన్నారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ రాజేంద్రనగర్ డీసీపీ, నార్సింగి ఏసీపీల పరిధిలోను లేదని లేఖలో పేర్కొన్నానని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రేఖయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, కౌన్సిలర్లు జి.శివారెడ్డి, శ్రీకాంత్ రావు, బి.యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



ప్రతిభా సర్టిఫికెట్లతో విద్యార్థులు

బండ్లగూడ: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హైదర్షాకోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మదన్‌మోహన్ పేర్కొన్నారు. సోమవారం హైదర్షాకోట్‌లోని షాడోస్ కుంగ్ ఫూ కరాటే గ్రాండ్ మాస్టర పూనపాటి మురళీకృష్ణం రాజు తన వద్ద కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులు ప్రతిభా సర్టిఫికెట్లను అందజేశారు. వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 70–100 శాతం మార్కులు సాధించిన వారికి సర్టిఫికెట్లు ఇచ్చి అభినందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. చదువుపై విద్యార్థులకు ఆసక్తిని పెంచేందుకు మాస్టర్ మురళీకృష్ణంరాజు పడుతున్న తపన అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో షాడోస్ కుంగ్ ఫూ గౌరవ అధ్యక్షుడు కిషోర్, సలహాదారుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు, బ్లాక్‌బెల్ట్ విద్యార్థులు శ్రీ వెన్నెలయాదవ్, శ్రీకృష్ణయాదవ్, గణేష్ పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

డాక్టర్ ఆదిల్ సోహెల్



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆదిల్ సోహెల్

మణికొండ: హఠాత్తుగా ఎవరికి పడితే వారికి వస్తున్న హార్ట్‌ఎటాక్‌లను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ సీపీఆర్‌లపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్ ఆదిల్ సోహెల్ అన్నారు. సోమవారం మణికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో కార్డియాక్ ఎటాక్‌పైన కౌన్సిలర్‌లు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కడైనా ఎవరైనా అకస్మాత్తుగా గుండె కొట్టుకోవటం ఆగిపోయి కింద పడిన వ్యక్తులను గమనించి వారికి సీపీఆర్ చేస్తే బతికే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్, కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయి మౌనిక, జేఏఓ వీరస్వామి, ఇన్‌చార్జి మేనేజర్ లక్ష్మి, హెచ్‌ఈఓ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు లక్ష్మీనారాయణ, పద్మారావు, పురుషోత్తం, వందన నగేష్, కోఆప్షన్ సభ్యులు లక్ష్మీరాములు, సిద్ధప్ప, తాజుద్దీన్, స్టాఫ్ నర్స్ కరుణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.